క్లుప్తంగా

నేడు రిపబ్లిక్ డే వేడుకలు

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఆవరణలో గణతంత్ర దినోత్సవాన్ని గురువారం నిర్వహించనున్నట్లు కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7.45 నిమిషాలకు నిర్వహించే కార్యక్రమంలో జాతీయ పతాకావిష్కరణ చేపడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

భోగాపురం: మండలంలోని తోటపల్లి బస్టాప్ కూడలి వద్ద ఎస్సై కృష్ణమూర్తి సిబ్బందితో కలిసి మంగళవారం రాత్రి వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో రామచంద్రపేట ఉప్పుగెడ్డ నది నుంచి భోగాపురం వైపు వెళ్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను తనిఖీ చేయగా.. ఎటువంటి అనుమతులు లేకపోవడంతో వాహనాలను సీజ్ చేశారు.

పాఠశాల తనిఖీ



కణపాక ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేస్తున్న డీఈఓ లింగేశ్వరరెడ్డి

విజయనగరం ఫూల్‌బాగ్: నగరంలోని కణపాక ప్రాథమిక పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారి బి.లింగేశ్వరరెడ్డి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల పుస్తకాలను పరిశీలించడంతో పాటు విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఈఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలకు మోటార్ వితరణ

విజయనగరం: నగరంలోని కొణిశివీధి నగర పాలక పాఠశాలకు కంచర్ల ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కేకే కుమార్ రూ. 35 వేల విలువైన మోటార్‌ను వితరణగా బుధవారం అందజేశారు. అలాగే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. అనంతరం కస్పా హైస్కూల్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన గార్డెన్‌ను ప్రారంభించారు. గార్డెన్‌కి అయ్యే ఖర్చంతా కుమార్ భరించారు.

మాదకద్రవ్యాలతో జీవితం చిత్తు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ మధుకుమార్

విజయనగరం క్రైమ్: మాదకద్రవ్యాల వినియోగంతో యువత జీవితం నాశనమవుతుందని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ బి.మధుకుమార్ అన్నారు. కార్పొరేషన్ పరిధిలో మహాలక్ష్మి జూనియర్ కళాశాలలో మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మత్తు పదార్థాల వల్ల ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తుతాయో వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరావు, అధ్యాపకులు, ఎస్ఈబీ కానిస్టేబుల్ బి.గంగాధర్ పాల్గొన్నారు.

రేషన్ దుకాణాల పరిశీలన



జొన్నవలసలో రేషన్ దుకాణాన్ని పరిశీలిస్తున్న అధికారులు

విజయనగరం రూరల్: నియోజకవర్గ పరిధిలోని రేషన్ దుకాణాలను మినిస్ట్రీ ఆఫ్ ఫుడ్, కన్స్యూమర్ ఫుడ్ పీడీఎఫ్ శాఖ టెక్నికల్ అధికారి ఏపీ వీరేంద్ర బుధవారం పరిశీలించారు. నియోజకవర్గంలోని కార్పొరేషన్ పరిధిలో 10, మండలంలోని జొన్నవలస, దుప్పాడ గ్రామాల్లో రేషన్ దుకాణాలను సందర్శించి బియ్యం నాణ్యతపె ఆరా తీశారు. అలాగే పట్టణంలోని దాసన్నపేటలో ఉన్న ఎంఎల్ఎస్ పాయింట్లలో బియ్యాన్ని కూడా పరిశీంచారు. కార్యక్రమంలో విజయనగరం పౌరసరఫరాల అధికారి అశోక్, మండల సీఎస్‌డీటీ వీవీఆర్ జగన్నాథరావు, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుల హెల్ప్‌లైన్ పోస్టర్ ఆవిష్కరణ

చీపురుపల్లి: వృద్ధుల జాతీయ హెల్ప్‌లైన్ పోస్టర్‌ను స్థానిక మండల పరిషత్ కార్యాలయం లో విజయనగరం, శ్రీకాకుళం జిల్లా ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్ జి.సింహాచలంతో కలిసి ఎంపీడీఓ కె.రామకృష్ణరాజు బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వృద్ధుల కోసం 14567 టోల్‌ఫ్రీ నంబర్‌తో జాతీయ హెల్ప్‌లైన్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందన్నారు. ఎవరైనా ఈ టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి వృద్ధులకు అన్యాయం జరిగినా, భావోద్వేగ సహాయం, వ్యక్తిగత, కుటుంబ తదితర సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. హెల్ప్‌లైన్ నుంచి సిబ్బంది స్పందించి వృద్ధులకు తగు సహాయం అందజేస్తారని తెలిపారు.

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం..

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, ఎంపీ బెల్లాన, ఎమ్మెల్సీ పెనుమత్స



భవనాల శిలాఫలకం ఆవిష్కరిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ పెనుమత్స, తదితరులు

పూసపాటిరేగ:

ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అమలు చేస్తున్న సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. మండలంలోని కోనాడలో సుమారు కోటి రూపాయలతో నిర్మించిన సచివాలయం, రైతుభరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్ భవనాలను బుధవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సచివాలయ వ్యవస్థ వల్ల పాలన ప్రజల ముంగిటకు చేరిందన్నారు. గతంలో ఎటువంటి పని ఉన్నా మండల కేంద్రానికి వెళ్లాల్సిన పరిస్థితులుండేవన్నారు. నేడు ఆ పరిస్థితి మారిందని తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయాల ఏర్పాటు వల్ల గ్రామాల్లోనే పనులన్నీ పూర్తి చేసుకునే అవకాశం ఉందని చెప్పారు. కోనాడ గ్రామంలో కోటి రుపాయలతో ఉమా రామలింగేశ్వర దేవాలయాల పునఃనిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్యవైశ్యుల కులాన్ని గుర్తించి తనకు డిప్యూటీ స్పీకర్ పదవి ఇచ్చారని కోలగట్ల వీరభద్రస్వామి తెలిపారు. ఈ ఏడాదిలోనే విశాఖ పరిపాలన రాజధానిగా మారుతుందని చెప్పారు. మహాత్మాగాంధిజి కలలుగన్న రామరాజ్యం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే సాధ్యమని స్పష్టం చేశారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు నిజ జీవితానికి , సినిమా జీవితానికి తేడా తెలియడం లేదని ఎద్దేవా చేశారు. రెచ్చగొట్టే ప్రసంగాలు చేసినంత మాత్రాన ప్రజలు విశ్వసించరన్నారు. సార్వత్రిక ఎన్నికలు సమీపించడంతో టీడీపీ దొంగలు గ్రామాల్లో తిరుగుతున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రానున్న ఎన్నికలలో ఓటుతో ఆశీర్వదించి జగన్ మోహన్‌రెడ్డికి మరోసారి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం తాడికొండ తనుశ్రీ సంక్షేమ పథకాలపై ఇంగ్లిష్‌లో చేసిన ప్రసంగం ఆకట్టుకుంది. కార్యక్రమంలో నెల్లిమర్ల నియోజకవర్గ పరిశీలకుడు అందవరపు సూరిబాబు, వైఎస్సార్‌సీపీ నాయకుడు కందుల రఘుబాబు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, ఎంపీపీ మహంతి కల్యాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మహంతి సీతాలక్ష్మి, వైస్ ఎంపీపీలు అల్లాడ రమేష్, ఎస్.సత్యనారాయణరాజు, ప్రజాప్రతినిధులు మహంతి శ్రీనివాసరావు, మహంతి జనార్దనరావు, పి.లక్ష్మీనారాయణ, అమర గురువులు, దాడిశెట్టి త్రినాథరావు, బొడ్డు ఉదయభారతి, దారపు అప్పల నర్సమ్మ, బొడ్డు ఎల్లాజీ, దాడిశెట్టి గోవింద, దారపు లక్ష్మణరెడ్డి, విజ్జపు కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

వేగం కన్నా ప్రాణం మిన్న

- ఎస్పీ ఎం.దీపికా పాటిల్



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్పీ దీపికాపాటిల్

డెంకాడ: వాహనాలు నడిపే వారు వేగం కన్నా ప్రాణం మిన్న అన్న విషయాన్ని మరువరాదని ఎస్పీ ఎం.దీపికాపాటిల్ అన్నారు. మండలంలోని జొన్నాడ వద్ద గల లెండి ఇంజినీరింగ్ కళాశాలలో రహదారి భద్రతపై బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ, వాహనాలు నడిపే యువత రహదారి నిబంధనలు తప్పకుండా పాటించాలన్నారు. మితిమీరిన వేగంతో వాహనాలు నడపటం వల్ల నడిపేవారి ప్రాణాలతో పాటు ఎదురుగా ఉన్న వారి ప్రాణాలు కూడా కోల్పోయే ప్రమాదం ఉందని, దీంతో ఆ కుటుంబాలు అన్ని విధాలుగా కోలుకోని స్థితికి చేరుకుంటారన్నారు. ప్రమాదాల్లో గాయపడితే దుర్భర జీవితం గడపాల్సిన దుస్థితి ఏర్పడుతుందని చెప్పారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు. ఆటోల్లో కూడా పరిమితికి మించి ప్రయాణికులు ఎక్కరాదన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ రామారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ టి.హరిబాబు, సీఐ విజయ్‌నాథ్, ఎస్సై మహేష్, కళాశాల ఫెమినావింగ్ సభ్యులు జానకి, శైలజ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆత్మీయ మహాసభకు తరలిరావాలి

- ఆంధ్రప్రదేశ్ తూర్పుకాపు సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు చంద్రమోహన్

విజయనగరం ఫూల్‌బాగ్: ఈ నెల 29న నిర్వహించనున్న తూర్పుకాపు ఆత్మీయ మహాసభకు ప్రతి ఒక్కరూ తరలిరావాలని ఆంధ్రప్రదేశ్ తూర్పుకాపు సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఎస్ఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో విజయనగరం జిల్లా కమిటీ సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో ఉన్న తూర్పుకాపు కులస్తులందరూ ఆదివారం ఉదయం సింహాద్రి ఫంక్షన్ హాల్‌లో జరుపుకుంటున్న ఆత్మీయ సభకు హాజరై ఐక్యతను చాటిచెప్పాలన్నారు. ఈ వేదిక ద్వారా తూర్పుకాపు కుల సమస్యల పరిష్కారానికి భవిష్యత్ కార్యాచరణక ప్రకటిస్తారన్నారు. కార్యక్రమంలో సంఘ జాతీయ ఆర్గనైజింగ్ కో కన్వీనర్ కడ్డాల శ్యామసుందరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిరాజు రాజారావు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జమ్ము ఆదినారాయణ, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కరిమజ్జి మల్లేశ్వరరావు, విజయనగరం జిల్లా అధ్యక్షుడు పత్తిగుళ్ల వెంకటరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇజ్జపురపు శ్రీనివాసరావు, జిల్లా గౌరవాధ్యక్షుడు పిసినిగిరి శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షుడు తుమ్మగంటి రామ్మోహనరావు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఏసుబాబు, యువజన విభాగ జిల్లా అధ్యక్షుడు గంటాడ మోహనరావు పాల్గొన్నారు.

నగర సుందరీకరణలో భాగస్వాములు కావాలి

- నగరపాలక సంస్థ కమిషనర్ శ్రీరాములనాయుడు



స్వచ్ఛంద సంస్థలు, వ్యాపార సంస్థ ప్రతినిధులతో సమావేశమైన కమిషనర్ శ్రీరాములనాయుడు

విజయనగరం: నగర సుందరీకరణలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యులు కావాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఆర్. శ్రీరాములనాయుడు పిలుపునిచ్చారు. బుధవారం ఆయన తన చాంబర్‌లో వివిధ స్వచ్ఛంద సంస్థలు, వ్యాపార సంస్థ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నగర సుందరీకరణలో భాగంగా గతంలో ప్రధాన జంక్షన్‌లను అభివృద్ధి చేశామన్నారు. ఆయా ప్రాంతాలలో మొక్కలను నాటి సంరక్షణ బాధ్యతలను వివిధ స్వచ్ఛంద సంస్థలు, వ్యాపార ప్రతినిధులకు అప్పగించామన్నారు. అయితే వాటి నిర్వహణలో మరింత చురుకైన పాత్రను పోషించాలని సూచించారు. మొక్కలకు అవసరమైన నీటిని తాము అందిస్తామని అయితే వాటి నిర్వహణ బాధ్యత సంపూర్ణంగా ఆయా సంస్థలు స్వీకరించాలని కోరారు. సమావేశంలో ఏసీపీ అమ్మాజీరావు, ఏఈలు వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులకు వైఎస్సార్‌సీపీతోనే గుర్తింపు



కోలగట్ల వీరభద్రస్వామిని సన్మానిస్తున్న ఆర్యవైశ్యులు

పూసపాటిరేగ: ఆర్యవైశ్యులకు వైఎస్సార్‌సీపీతోనే గుర్తింపు లభించిందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. మండలంలోని కోనాడలో డిప్యూటీ స్పీకర్ కోలగట్లను స్థానిక ఆర్యవైశ్యులు బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆర్యవైశ్యులు వైఎస్సార్‌సీపీకి అండగా నిలబడి ఓటుతో ఆశీర్వదించా లని కోరారు. కార్యక్రమంలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు, వైఎస్సార్‌సీపీ మండ ల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, కందుల రఘుబాబు, ఎంపీపీ కల్యాణి, జెడ్పీటీసీ సభ్యురా లు సీతాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపాల్ కేవీఎల్ రాజు, తదితరులు

డెంకాడ: జాతీయ యువజనోత్సవాల్లో పాల్గొన్న ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ముగ్గురు ఎన్ఎస్ఎస్ విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీఎల్ రాజు బుధవారం అభినందించారు. కర్ణాటకలోని హుబ్బళ్లి–ధార్వాడ్ వద్ద యువజన వ్యవహారాలు, క్రీడలు మంత్రిత్వశాఖ, కర్ణాటక ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహించిన 26వ జాతీయ యువజోత్సవాల్లో కళాశాలకు చెందిన ఏవీఎస్ ప్రత్యూష్, అశిష్‌కుమార్, ఐ.యశ్వంత్‌వర్మ పాల్గొని సేవలందించారు. దీంతో విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు ఎన్ఎస్ఎస్ పీఓ ఎన్.షణ్ముఖరావు, స్టూడెంట్ డీన్ ఎస్.మోహన్‌కుమార్, తదితరులు అభినందించారు.

జనరంజక పాలనకు జేజేలు

- ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బడ్డుకొండ



కోనాడలలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే బడ్డుకొండ, తదితరులు

పూసపాటిరేగ: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలనకు ప్రజలు జేజేలు పలుకుతున్నారని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, నెల్లిమర్ల శాసనసభ్యుడు బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని కోనాడలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎంపీ, ఎమ్మెల్యే, తదితరులకు ఘన స్వాగతం పలికారు. అనంతరం సచివాలయ సిబ్బంది, అధికారులు, ప్రజా ప్రతినిధులు ఇంటింటికీ వెళ్లి మూడున్నరేళ్ల కాలంలో అమలవుతున్న సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. ఒక్కో కుటుంబానికి ఎంత లబ్ధి చేకూరినదీ వివరిస్తూ ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ, పేదల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి విప్లవాత్మకమైన పథకాలు ప్రవేశపెట్టారన్నారు. ప్రభుత్వ సేవలు పొందేందుకు ఏ ఒక్కరూ ఇబ్బంది పడకూడదనే గ్రామాల్లో సచివాలయాలు ఏర్పాటు చేశారని తెలిపారు. ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు మాట్లాడుతూ, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన ప్రతి సమస్యనూ పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. దేశం మొత్తం గుర్తించే విధంగా సచివాలయ వ్యవస్థతో సుపరిపాలన అందజేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని చెప్పారు. నెల్లిమర్ల నియోజకవర్గ పరిశీలకుడు అందవరపు సూరిబాబు మాట్లాడుతూ, వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలలో 98 శాతం వరకు అమలు చేశారన్నారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డికి వస్తున్న ప్రజాదరణ చూడలేకే ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయని ఆరోపించారు. రాబోయే ఎన్నికలలో ఓటుతో ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, ఎంపీపీ మహంతి కల్యాణి, వైస్ ఎంపీపీలు అల్లాడ రమేష్, ఎస్.సత్యనారాయణరాజు, సర్పంచ్ బొడ్డు ఉదయభారతి, ఎంపీటీసీ సభ్యురాలు దారపు అప్పలనర్సమ్మ, ప్రజాప్రతినిధులు మహంతి శ్రీనివాసరావు, మహంతి జనార్దనరావు, అమర గురువులు, దాడిశెట్టి త్రినాథరావు, బొడ్డు ఎల్లాజీ, దారపు లక్ష్మణరెడ్డి, వి.కిరణ్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ఆరా..

విజయనగరం: నగరంలోని ఆరో డివిజన్ ప్రశాంతి నగర్‌లో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పాల్గొని ప్రజా సమస్యలపై ఆరా తీశారు. పథకాల వల్ల ఒక్కో కుటుంబానికి ఎంత లబ్ధి చేకూరినదీ అడిగి తెలుసుకోవడంతో పాటు ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. అనంతరం సమస్యలను తెలియజేయాలని కోరగా.. స్థానికులు పలు సమస్యలు తెలియజేశారు. దీంతో ఎమ్మెల్యే స్పందిస్తూ ఆయా సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జోనల్ ఇన్‌చార్జ్‌లు బొద్దాన అప్పారావు, రెడ్డి గురుమూర్తి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నగరంలో చేపడుతున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాలకు ప్రజా స్పందన విశేషంగా వస్తోందన్నారు. అర్హతే ప్రామాణికంగా ప్రతి పథకాన్ని లబ్ధిదారులకు అందిస్తూ ప్రజారంజక పాలన చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ రేవతీదేవి, సహాయ కమిషనర్ ప్రసాదరావు వైఎస్సార్‌సీపీ నాయకులు ఆల్తి శ్రీనివాసరావు, పొంతపల్లి గోపి, తదితరులు పాల్గొన్నారు.



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం



విజయనగరం: ప్రతిజ్ఞ చేస్తున్న క్రీడాకారులు

విజయనగరం: జిల్లా క్రీడాప్రాధికార సంస్థ, నెహ్రూ యువకేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. నగరంలోని రాజీవ్ క్రీడామైదానం ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో ఓటుహక్కు ఆవశ్యకతను చీఫ్‌కోచ్ అప్పలనాయుడు వివరించారు. ఈ సందర్భంగా ఓటుహక్కును పవిత్రంగా వినియోగించుకుంటామంటూ క్రీడాకారులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం విభిన్న ప్రతిభావంతుల క్రీడాపోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్న క్రీడాకారులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సిబ్బంది, నెహ్రూ యువ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ఓటే వజ్రాయుధం..

నెల్లిమర్ల: ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధమని వైఎస్సార్‌సీపీ నెల్లిమర్ల నగర పంచాయతీ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు అన్నారు. 13వ జాతీయ ఓటర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో పలువురు సీనియర్ ఓటర్లకు తహసీల్దార్ కేవీ రమణరాజు, చైర్‌పర్సన్ బంగారు సరోజినితో కలసి సత్కరించారు. అలాగే కొత్తగా మంజూరైన ఓటర్లకు గుర్తింపు కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ, అర్హత కలిగిన యువజనులంతా ఓటర్లుగా పేర్లు నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. అలాగే ఓటరు జాబితాలో మార్పులు, చేర్పుల కోసం సంబంధిత బీఎల్ఓలను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ కారుకొండ వెంకటకృష్ణారావు, వార్డు కన్వీనర్లు నల్లి శ్రీనివాసరావు, తుమ్మ నారాయణమూర్తి, మజ్జి గణేష్, బూర సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



డెంకాడ: సీనియర్ ఓటర్‌ను సత్కరిస్తున్న కనకసింహాచలం, తదితరులు



నెల్లిమర్ల: సీనియర్ ఓటర్‌ను సత్కరిస్తున్న సాంబశివరావు, తదితరులు

సీనియర్ ఓటర్లకు సన్మానం

డెంకాడ: మండల కేంద్రంలో జాతీయ ఓటర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. డెంకాడ పీఏసీఎస్ అధ్యక్షుడు రొంగలి కనకసింహాచలం చేతుల మీదుగా సీనియర్ ఓటర్లను సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ పతివాడ గౌరి, సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని కాపాడుకుందాం



కార్యక్రమంలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు

విజయనగరం ఫూల్‌బాగ్: బీజేపీ నుంచి భారతదేశాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు ప్రజలంతా ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని సీఐటీయూ నగర అధ్యక్షుడు ఎ. జగన్ మోహన్‌రావు పిలుపునిచ్చారు. 73వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాజ్యాంగంపై పెద్ద ఎత్తున దాడి జరుగుతోందన్నారు. ప్రజలు ఏ భాషలో మాట్లాడాలి.. ఏం మాట్లాడాలి.. ఏ బట్ట కట్టుకోవాలి.. ఏ తిండి తినాలి అనేది బీజేపీ నిర్ణయిస్తోందని ఆరోపించారు. ఎవరైనా ప్రశ్నిస్తే కేసులు బనాయిస్తోందన్నారు. బీజేపీకి వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్టీసీ కాంట్రాక్ట్ కార్మికులు శంకర్రావు, రంగమ్మ జగదీష్, రాజు, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవార్ల తీర్థాలు



కొత్తవలస రూరల్: పైడితల్లి అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

కొత్తవలస రూరల్: మండలంలోని వీరభద్రపురంలో వెదుళ్ల పైడితల్లి, మిందివలసలో బండిమాంబ అమ్మవార్ల తీర్థం బుధవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే అమ్మవార్లకు పూజలు చేశారు. తీర్థం సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మిందివలసలో కోలాటం పోటీలు నిర్వహించారు. మొదటి స్థానంలో నిలిచిన శ్రీరామపట్నం, జొన్నవరం గ్రామాలకు చెందిన కోలాటం బృందాలకు రూ. 15,016, ద్వితీయ స్థానంలో నిలిచిన జైతవరం బృందానికి రూ.10,016, తృతీయ స్థానంలో నిలిచిన వీరభద్రపేట బృందానికి రూ.8,016 నగదు బహుమతిని గ్రామ నాయకులు పాలమరశెట్టి రామకృష్ణ, పెద్దలు అందజేశారు.

ఆకట్టుకున్న ఎడ్ల పరుగు ప్రదర్శన

వేపాడ: వల్లంపూడి గ్రామంలో సాంబమూర్తి తీర్థం సందర్భంగా బుధవారం నిర్వహించిన ఎడ్ల పరుగు ప్రదర్శన ఆకట్టుకుంది. పోటీల్లో 15 జతల ఎద్దులు పాల్గొన్నాయి. మొదటి ఆరు స్థానాల్లో నిలిచిన ఎద్దులకు సంబంధించిన యజమానులకు నిర్వాహకులు నగదు బహుమతులు అందజేశారు. తీర్థం సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.